# గలగలా గోదారి

ఇరవయ్యవ

'శ్రీసీతారామాభ్యాన్నమః'అన్న గొంతుక విని,ఆ ఇల్లాలు గుప్పెటతో బియ్యం తీసుకొచ్చింది. తీసుకొచ్చి, పాల తప్పేలాలా వున్న కంచు చెంబులో వెయ్యబోయి, ఆగిపోయిందిరా అబ్బాయ్. చెయ్యి ముందుకు సాగలేదు. గుప్పెట విడలేదు. ముందుకు వెళ్ళిన చెయ్యి వెనక్కొచ్చింది. గుప్పెట్లో బియ్యం కిటికీలో పోసి, ఆ ఇల్లాలు లోపలికెళ్ళిపోయింది.

రామశాస్త్రి తెల్లబోయాడ్రా అబ్బాయ్, ఆ ఇల్లాలి ప్రవర్తనకి కారణం అతగాడికి అంతుబట్టలేదు.''అదేవిటమ్మా''అని అడగనూలేదు. అడగాలనీ అనిపించలేదు. నవ్వుతూ వుండే అతని ముఖం చిన్నబోయింది. వుండాలో వెళ్ళిపోవాలో తెలియని స్థితి. మెల్లిగా మెట్లు దిగి, మరో గుమ్మం ఎక్కాడు. అక్కడా అదే అనుభవం. ఆ విధంగా మరో రెండు ఇళ్ళల్లోనూ జరిగేసరికి అతగాడిని నీరసం ఆవహించేసింది. ఎందుకలా జరుగుతోందీ అన్న విషయం గ్రాహ్యంకాలేదురా. కర్తవ్యం ఏవిటా అన్నది అర్థంకాని స్థితిలో, ఓ అరుగుమీద నిస్త్రాణగా కూర్చుండి పోయాడు.

సోమవారం వృత్తిలోకి రామశాస్త్రి కొత్తగా ప్రవేశించాడురా. వేదం చదువుకుందామనుకున్నవాడు, విధి విసిరిన వలలో చిక్కి, వ్యావారం చెయ్యడం ప్రారంభించాడు. మొలక మీసం ఇంకా మొలవని పసివాడు, పది వూళ్ళు తిరుగుతూ మొత్తం కుటుంబ భారాన్ని మోయడం ప్రారంభించాడు. కాగితం కలం పట్టుకుని కవిత్వాలు అల్లుదామని అనుకోకపోయినా కనీసపు చదువు కన్నా నోచుకోని కుర్రవాడు, కాళ్ళరిగేలా తిరుగుతూ, కలిగిన లోగిళ్ళలో ''సీతారామాభ్యాన్నమః''అనసాగాడు. విధియొక్క విచిత్ర గమనాన్ని ఎవడు తెలుసుకోగలడురా అబ్బాయ్. బలీయమైన విధి ప్రవాహంలో ఒక గడ్డిపోచరా రామశాస్త్రి.

రామశాస్త్రి సోమవారం ప్రారంభించి నెల రోజులింకా కాలేదురా అబ్బాయ్. స్వతహాగా అమాయకుడు, ఆపైన పసివాడు అవడంవల్ల, పదిమందిలోనూ అణకువగా వుంటూ ''పిల్లవాడు బుద్ధిమంతుడు'' అని పేరు తెచ్చుకున్నాడు. అటువంటిది, ఆరోజు అడుగుపెట్టిన ప్రతి ఇంటిలోనూ అనాదరణ ఎదురవడం, ఆ పసిహృదయాన్ని పెద్ద పెట్టున తాకిందిరా. కారణం తెలియక అయోమయుడయ్యాడురా. ఆ అరుగు మీద అలానే కూచుండిపోయాడు, మోకాళ్ళలో తలకాయ పెట్టుకుని. పెల్లుబుకుతున్న దుఃఖాన్ని పదిమందిలో ప్రకటించడం ఇష్టంలేని పసివాడురా. అందుకే ఆ దుఃఖాన్ని గుండెల్లో బిగబట్టి వుంచాడురా. అలా ఎంతసేపు వుండగలడు. అవసరం ఊపిరి సలపనివ్వదు. మెల్లిగా అరుగుదిగి, కంచు చెంబు చేత బట్టుకుని, అడుగేసి మరో గుమ్మం ఎక్కాడు. ఇరుకునపడ్డ మనసు ఇబ్బంది పెడుతున్నా, పెదవులు యాంత్రికంగా ''సీతారామాభ్యాన్నమః''అన్నాయి. సావిట్లో గృహ యజమాని కూచుని వున్నాడు, పంచాంగం చూసుకుంటూ. ఆ ఇల్లాలు గుప్పెడు బియ్యం పట్టుకొచ్చి, రామశాస్త్రి పట్టుకున్న చెంబులోకి పొయ్యబోయి, ఆగి పక్కనున్న



కిటికీలో పోసేసింది. ఆపుకోలేని దుఃఖం ఆ పసివాడి గొంతులో వెక్కుమందిరా. ఆ ఇల్లాలి ముఖంలో జాలి తప్ప మరో భావం లేదురా.

అబ్బాయ్, ఆ వెక్కిన శబ్దానికి, ఆ యజమాని

## శ్రీసీతారామాభ్యాన్నమః

తలెత్తి చూశాడు. ''ఏమిటే'' అన్నాడు ఇల్లాలిని.

''చెంబు నిండుకుని వుందండి'' అందా ఇల్లాలు.

ఆ యజమాని లేచివచ్చి, రామశాస్త్రి చెంబులోకి చూసి, ''తల్లి తప్ప మరొకరు ఖాళీ చెంబులో భిక్ష వెయ్యకూడదని తెలియదా నాయనా'' అన్నాడ్రా.

మాటపెగలని పసివాడు తల అడ్డంగా వూపాడురా అబ్బాయ్.

''ఖాళీ పాత్రలో భిక్ష వేస్తే, ఆ వేసిన వాడి ఐశ్వర్యం పోతుందనే నమ్మకం వుందయ్యా. అందువల్ల ఎవరూ వెయ్యరు. పాత్రలో నాలుగన్నా బియ్యపు గింజలుండాలి నాయనా. ఈ రోజుకెలాగో గడుపుకుని, రేపట్నుంచి ఈ విషయాన్ని విస్మరించకుండా వుండు. అశక్తులం నాయనా. వెళ్ళిరా'' అన్నాడురా ఆ గృహస్థు, తన అసమర్థతకి బాధపడుతూ.

నాన్నా, ఆ మాటలు ఆ పసివాడికి విద్యుద్ఘాతాలయ్యాయిరా. తడబడుతున్న అడుగులతో అనాలోచితంగా, రామలింగడి గుడిలోకి అడుగు పెట్టాడురా. కళ్ళలో వుబుకుతున్న గంగా ప్రవాహంతో దూరం నుంచే ఆ రామలింగడికి అభిషేకం చేసి, గుడి వెనకకి పోయి, గుండెలో భారాన్ని దించుకోసాగాడురా.

ఆ సాయంత్రం, ఆ మర్నాడు కుటుంబానికి పస్తు తప్పదన్న భావం ఆ కుర్రవాడిని కుదిపేస్తోందిరా. పక్షవాతంతో పడి వున్న తండ్రి, తన కోసం గుమ్మంలోనే కూర్చుని ఎదురు చూసే తల్లీ, చెల్లెళ్ళు అందరూ కళ్ళముందు కదుల్తున్నార్రా. కడుపులోంచి ఎగదన్నుతున్న శోకం గుండెల్ని దాటి పెదాలు చీల్చుకుని ప్రవహిస్తోందిరా.

రామలింగడి గుళ్ళో సదాశివశాస్త్రిగారు స్వయంగా ఆ పరమశివుడికి అభిషేకం చేస్తున్నారు. ఆ రోజు కార్తీక సోమవారం. శాస్త్రిగారు, ఆవూరి బ్రాహ్మణ్యంలో ప్రథములు. వేద స్వరూపులు. ఆ ప్రాంతంలో ఆయన పేరు చెబితే నమస్కరించనివారు అరుదు. ఆయన అభిషేకం చేస్తూ వుంటే, ఆలయ పూజారి పక్క నుంచి కావలసినవి సమకూరుస్తున్నాడు. సంతత ధారగా సాగుతున్న అభిషేకానికి అడ్డుకట్టలా, రా.ఎశాస్త్రి వెక్కిళ్ళు వినిపించాయిరా వారికి. పూజారికేసి ప్రశ్నార్థకంగా చూశారు. విషయం తెలుసుకోడానికి బయల్దేరబోయిన పూజార్ని వారించి, పూజ తెముల్చుకుని, నిర్మాల్యం శిరస్సున ధరించి గర్భగుడిలోంచి బయటికి వచ్చారు. వచ్చి వెక్కిళ్ళని వెతుక్కుంటూ రామశాస్త్రిని సమీపించారు.

''ఏమిటి తం.డీ నీ దుఃఖ కారణం'' అన్నారు ఆ పసివాడి వీపు నిమురుతూ.

మాట పెగలని పసివాడు, ఆసరా దొరికినట్టు ఆయన పాదాల మీద పడి, తల్లి వొళ్ళో పడ్డ పిల్లవాడిలా బావురుమన్నాడురా.

ఆ కుర్రవాడి భుజం మీద నుంచి వేళ్ళాడుతూ గాలికెగురుతున్న ఖాళీ జోలె, పక్కనున్న కంచు చెంబు చెబుతున్న కథని, పసివాడి వెక్కిళ్ళ సారాన్ని గ్రహించారురా ఆయన.

ఆ పసివాడ్ని లేవనెత్తి, భుజం మీద చెయ్యి వేసి ఇంటికి నడిపించుకుంటూ వెళ్ళారురా అబ్బాయ్ శాస్త్రిగారు. ఇల్లాల్ని పిలిచి, విస్తరి వెయ్యమని చెప్పి, ఆ కుర్రవాడికి అర్ఘ్యపాద్యాదులిచ్చి, ఆహ్వానించారు.

''నాయనా రా! ఈ రోజు కార్తీక సోమవారం. కుమారస్వామిలా మా ఇంటికొచ్చావు. నా ఆతిథ్యం స్వీకరించు'' అని కొసరి కొసరి వడ్డిస్తూ బుజ్జగిస్తూ ఆ పసివాడి కడుపుమంట చల్లార్చారు.

తాంబూలంలో ఒక వరహాకి సమతూకమైన నాలుగు విచ్చు రూపాయిలు పెట్టి, అతగాడికి సంభావనిచ్చారు.

''నాయనా నీ ఇంటికి కావలసిన సంభారాలు తీసుకు వెళ్ళు. నీ కంచు చెంబే నీ ఐశ్వర్యం. దానిని ఎప్పుడూ ఖాళీగా వుంచకూడదు. ఏ రోజూ దానిని నిశ్శేషంగా వుంచకు. వెళ్ళిరా నాయనా. శుభం'' అని నిండుగా ఆశీర్వదించి, సాదరంగా సాగనంపారురా అబ్బాయ్.

ఆ రోజుల్లో మనుషులకీ, మానవత్వానికే ప్రాధాన్యతరా.